శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



## వేడుకగా శ్రీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం
### 108 కలశాలతో మహిళల ఊరేగింపు



**బుచ్చి జనవరి 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని వాసవీ నగర్‌లో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో ఆత్మార్పణ దినోత్సవం వేడుకగా జరిగింది. ఆర్యవైశ్య మహిళలు పెద్దఎత్తున కలశాలు నెత్తిన పెట్టుకొని చెన్నూరురోడ్డు లోని వినాయకుడి గుడి వద్ద నుండి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సన్నిధి వరకు శ్రీవాసవీ మాతకు జై అంటు నినాదాలు చేస్తు సాగింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో మహిళలు తీసుకొని వచ్చిన 108 కలశాలతో తెచ్చిన తీర్ధంతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని దర్శించుకొని భక్తులు పరవశించారు. ఈకార్యక్రమంలో ఇన్నమూరి నరసింహరావు,ఇనుగూరు సుబ్బారావు మాట్లాడుతు దేశ మంతా ఆర్యవైశ్యులు అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. అలాగే శ్రీవాసీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం హర్షనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మ వారి దేవస్ధానం చైర్మన్ గునుపూడి శ్రీనివాసులు, దేవస్ధానం గౌరవాధ్యక్షులు ఇన్నమూరి క్రిష్ణయ్య, ఇన్నమూరి నరసింహరావు (లాయర్), వాసవీక్లబ్ కమీటి అధ్యక్షులు మాలేపాటి రవికుమార్,కమీటి సభ్యులు పాల్గోన్నారు. కార్యక్రమంలో సత్యాన్వేషణ ధాన్యయోగా సెంటర్ గురువు గుబ్బా లక్ష్మీనారాయణ భక్తిపాటలు ఆలపించారు. ఆర్యవైశ్య పెద్దలు ఇనుగూరు బాలయ్య,పలువురు యువకులు పరవశించి అమ్మవారి గీతాలకు పరవశించి నృత్యాలు చేశారు.

## ఆర్యవైశ్యుల ఆత్మబంధువు ముఖ్యమంత్రి చంద్రబాబు



**కావలి, జనవరి31 ప్రభాతవార్త** ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ జరిగినరోజున రాష్ట్ర ప్రభుత్వం అధికార కార్యక్రమంగా ప్రకటించి ఉత్తర్వులు విడుదల చేసిన ఆర్యవైశ్యుల ఆత్మబంధువు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు కొనియాడారు. ఎన్నికలముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టగానే చంద్రబాబు ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. ఆయన చిత్తశుద్ధిని, వైశ్యసామాజికవర్గంపై ఉన్న ప్రేమాభిమానాలకు ఇది నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యులతోపాటు భక్తకోటి వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఎంతో వైభవంగా జరపడం శుభపరిణామమన్నారు. కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తమ సామాజిక వర్గంపట్ల ప్రత్యేక అభిమానాలు చూపుతున్నారన్నారు. అన్నివిధాలుగా వైశ్యులకు అండగా నిలిచారన్నారు. ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నారన్నారు. ఇచ్చిన హామీమేరకు మాటనిలబెట్టుకున్న సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, రాష్ట్రమంత్రి టిజి.భరత్, కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, ఎమ్మెల్యే శ్రీరామ్‌తాతయ్య, కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులకు డైరక్టర్ తటవర్తి వాసు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



**కందుకూరు, జనవరి 31, ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని పెద్ద బజారులో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటా ్లడుతూ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు రాష్ట్ర విద్యా, మానవవనరుల శాఖమంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్యులకు ఇచ్చినహామీ మేరకు ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలియజేశారు. శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు అందరికి కలగాలని దుష్టులను శిక్షించి మంచివారిని రక్షించడానికి జగజ్జనని శ్రీ కన్యకా పరమేశ్వరి అవతారం దాల్చారు. కందుకూరు నియోజకవర్గం ప్రజలందరికి వాసవి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణపార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి వెంకట సుబ్బారావు, మురారిశెట్టి సుధీర్, కొత్తూరి వెంకట సుధాకర్, కోట నరసింహం, కోటా కిషోర్, గుర్రం అల్లూరయ్య, చీదెళ్ళ వేణు, తాతా లక్ష్మీ నారాయణ, కాకుమాని ప్రవీణ్, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధు, ముచ్చు శ్రీను, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, పార్టీ నాయకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ ప్రోత్సహించడం నేరం



**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త–వైద్యం** లింగ నిర్ధారణ పరీక్షలను బహిరంగ పరచడమంటే భ్రూణ హత్యలను ప్రోత్సహించడమేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వంగల సుజాత అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు కొరకు జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రధాన లక్ష్యం లింగనిర్ధారణ పరీక్షలను అరికట్టడం, భ్రూణ హత్యలను తగ్గించడమేనన్నారు. పురుషులు, మహిళల నిష్పత్తిని సమతుల్యం చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో లింగ నిష్పత్తి ప్రతి 1000 బాలురకు 1011 బాలికలు ఉన్నారని, రాష్ట్రంలో జిల్లా నాల్గో స్థానంలో ఉందన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్టానికి లోబడి తమ స్కానింగ్ కేంద్రాలు నిర్వహించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేకూడదని, చట్ట నియమనిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా త్వరలో జిల్లాలో స్కానింగ్ సెంటర్‌లపై ఆకస్మికంగా డెకోయ్ ఆపరేషన్‌లు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ సర్దార్ సుల్తానా, డాక్టర్ సీహెచ్ కిరణ్, అనాటమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వర్ణ రెడ్డి, డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీఎల్ దయాకర్, ఎన్‌జీఓలు జి.కవితరెడ్డి, ఐ.శ్రీనివాసరావు, కే.కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

## అన్నం ఇలా ఉంటే ఎలా
### మీ బిడ్డలకు ఇదే ఆహారం పెడతారా



**కోవూరు,జనవరి 31ప్రభాతవార్త :** ఉడికి ఉడకని అన్నం.. సక్రమంగా సరిపోని కూర.. వలవని గుడ్లు.. ఈ విధంగా అన్నం ఉంటే మీ బిడ్డలకు దీనిని పెడతారా అంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎన్. విజయభారతి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను ప్రశ్నించారు. శుక్రవారం ఆమె మధ్యాహ్న భోజన పథకాన్ని నిశితంగా పరిశీలించారు. భోజనం సక్రమంగా ఉడకలేదని, దీనిని తింటే విద్యార్థుల ఆరోగ్యం ఎలా ఉంటుందన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు సక్రమమైన పౌష్టికాహారం అందించలేకపోతే మానుకోవాలని సూచించారు. ఎదిగే వయస్సులో ఉన్న ఈ చిన్నారులకు తప్పనిసరిగా బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తమకు ప్రభుత్వం ద్వారా వస్తున్న బియ్యం సక్రమంగా లేవని, కొంచెం ఉడికితే ముద్ద అయిపోతుందని, సక్రమంగా లేని పక్షంలో బియ్యం, బియ్యంగా ఉంటున్నాయని ఈ విషయాన్ని కమిషన్ సభ్యురాలు దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. తాను మరలా వస్తానని, ఈ లోగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు కూడా లేవని, మంచినీరు కూడా సక్రమంగా రావడం లేదని, పాఠశాల పక్కనే ఉన్న బాలుర సంక్షేమ వసతి గృహానికి ఉన్న తలుపు 24 గంటలు తీసి ఉండడం మంచిది కాదని, అవసరమైనప్పుడు మాత్రమే దానిని వాడుకోవాలని, మిగతా సమయాల్లో తాళాలు వేయాలని ఈ సందర్భంగా ఆమె ప్రధానోపాధ్యాయురాలుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి–2 వై. చెంచులక్ష్మమ్మ, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి , ఉపాధ్యాయులు ఉన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జనవరి31, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 1838 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 67.078 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 2750, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.082 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## ఇస్తిమా వేడుకకు విపిఆర్ ఫౌండేషన్ 25 లక్షల విరాళం - ఎంపి వేమిరెడ్డి

### - ముస్లిం మత పెద్దలతో వేమిరెడ్డి దంపతులు సమీక్ష



**కొడవలూరు (విడవలూరు), జనవరి 31, ప్రభాతవార్త** మండలంలోని చంద్రశేఖరపురం గ్రామంలో ఇస్తిమా పేరిట జరిగే ఇస్లామిక్ శాంతి సభ కోవూరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు పేర్కొన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి తబ్లిగ్ జమాత్ నిర్వహించే రాష్ట్ర స్థాయి ఇస్తిమా ప్రాంగణం వేమిరెడ్డి దంపతులు సందర్శించారు. ఫిబ్రవరి 22,23 తేదీలలో రెండు రోజులు జరిగే ఇస్తిమా సందర్భంగా ఏర్పాట్ల పై ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు రెండు లక్షల మంది హాజరయ్యే ఇస్తిమాకు ప్రభుత్వ పరంగా తాగునీరు, శానిటేషన్, విద్యుత్, రవాణా తదితర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అదే విధంగా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇస్తిమా నిర్వహణకు 25 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్తిమా విజయవంతం చేసేందుకు పరిసర గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. రెండు రోజులపాటు ఇస్తిమా నిర్వహణకు సంబంధించి ఏ అవసరమైన తనను సంప్రదించాలని తెలిపారు. దంపతుల సహాయ సహకారాలు ముస్లిం పెద్దల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు ఆయురారోగ్యాలతో వుండాలని ముస్లిం మత పెద్దలు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి జాకీర్ షరీఫ్, మైనారిటీ నాయకులు నన్నే సాహెబ్‌లతో పాటు పలువురు కొడవలూరు మండల టిడిపి నాయకులు ,ఎంపిడిఓ సుబ్బారావు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



## 9న ఆత్మకూరులో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం

**హాజరుకానున్న మంత్రులు నారాయణ, బిసి జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, సవిత**
**రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో గృహ సముదాయాల్లో రామాలయాల నిర్మాణం**
**అమృతదార - 2 పేరుతో తాగునీటి సమస్యల పరిష్కారానికి భగీరథయత్నం**
**గ్రామీణ వ్యవస్థ మెరుగుదలకు సిఎం, డిప్యూటీ సిఎం కృషి**
**గత పదేళ్లుగా ఆత్మకూరులో అభివృద్ధి శూన్యం**
**ఇది ఆరంభం మాత్రమే భవిష్యత్తులో మరింత వేగంగా ఆత్మకూరు అభివృద్ధి**
**మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త – కలెక్టరేట్** గత పదేళ్లుగా ఆత్మకూరు నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు ప్రారంభానికి తిరిగి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 9న ఆత్మకూరులో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాల నేపథ్యంలో శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో ఇన్చార్జ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గత పదేళ్లుగా ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎక్కడ మొదలు పెట్టామో అక్కడే పనులన్నీ ఆగిపోయాయని ఆ పనులన్నింటిని తిరిగి ప్రారంభించేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 9న నలుగురు మంత్రులతో ఆత్మకూరులో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయించనున్నట్లు తెలిపారు. మంత్రులు పొంగూరు నారాయణ, సత్యకుమార్ యాదవ్, సవిత, బిసి జనార్దన్ రెడ్డి ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో గృహాల సముదాయాలలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాలు నిర్మాణానికి ముఖ్యమంత్రి అనుమతులు ఇచ్చారని, తొలుత ఆత్మకూరు టిడ్కో కాలనీ నుంచి ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మకూరుకు మంజూరైన బిసి బాలికల గురుకుల పాఠశాలను తాత్కాలికంగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభించనున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకు అవసరమైన ఫర్నిచర్, ఎలక్ట్రికల్ సామాగ్రి ఇతర సదుపాయాలను కలెక్టర్ నిధులు, దాతల సహకారంతో సమకూర్చినట్లు చెప్పారు. రూ. 96 కోట్లతో ఆత్మకూరు పట్టణానికి తాగునీటి సరఫరా కోసం అమృత్ 2 పథకానికి పనులు మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఆధునీకరించిన ఆత్మకూరు ఆర్అండ్‌బి అతిధి గృహం ప్రారంభిస్తామన్నారు. ఆత్మకూరు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి బైపాస్ రోడ్డు విస్తరణ బ్యూటిఫికేషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఆత్మకూరు మండల కాంప్లెక్స్ వద్ద జడ్పి నిధులు రూ. 1.70 కోట్లతో పంచాయితీ రాజ్ అతిధి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో గౌరవ పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 107 మంది వికలాంగులకు మోటరైజ్‌డ్ ట్రై సైకిల్స్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రూ. 30 లక్షలతో ఆత్మకూరు మున్సిపాలిటీకి లిఫ్ట్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. రూ. 2 కోట్లతో ఆత్మకూరు రిజర్వాయర్ బ్యూటిఫికేషన్ పనులు కూడా నిధులు రూ. కోటితో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి బ్లడ్ బ్యాంక్ ప్రారంభానికి చర్యలు చేపట్టామని, వంద పడకల ఆసుపత్రి స్థాయిని కూడా పెంచేందుకు ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి ఆనం చెప్పారు. ఫిబ్రవరి 9న ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధం కావాలన్నారు. అందరి సమన్వయంతో అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేసి మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

**ఉమ్మడి జిల్లాలో రూ. 8400 కోట్ల అంచనాతో జల్ జీవన్ మిషన్ పనులు**

**ఆత్మకూరు ప్రజల దాహార్తి శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా అమృతధార – 2 , మంత్రి ఆనం**

ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన మంచి నీటిని అందించడమే లక్ష్యంగా తీవ్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. జల్ జీవన్ మిషన్ పనులపై ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, సోమశిల తెలుగుగంగ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాగునీటి సమస్యల పరిష్కారానికి తమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భగీరథ ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అన్నారు. గ్రామీణ వ్యవస్థకు మెరుగులుదిద్దుతూ తాగు నీటి సౌకర్యాన్ని విస్తృతపరిచి ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికి తాగునీరు ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పంగా మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ పాలకులు కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరు చేసిన కోట్లాది రూపాయల నిధులను సద్వినియోగం చేసుకోలేదని తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 10 నుంచి 15 శాతం ఇళ్లకు కూడా కొళాయి కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన జల్ జీవన్ పనులను రద్దు చేసి కొత్త డిపిఆర్‌లు తయారు చేసి ప్రతి ఇంటికి నీరు అందించేలా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు మంత్రి చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈలు, డిఇలు స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి పనులను ప్రతిపాదించాలని సూచించారు. థర్డ్ పార్టీ కన్సల్టెన్సీలను కూడా ఏర్పాటు చేశామని అధికారులు సమన్వయంతో వీరు పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేయనున్నట్లు చెప్పారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపి పనులు మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. 2011 సెన్సస్ ప్రకారం జిల్లా జనాభా 20.09 లక్షలు కాగా 2058లో 27.52 లక్షలుగా అంచనా వేసినట్లు మంత్రి చెప్పారు. సోమశిల కండలేరు జలాశయాల నీటిని వినియోగించుకుని ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2058 సంవత్సరం జనాభా అవసరాలకనుగుణంగా నీటిని అందించేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. సోమశిల నుంచి 24 మండలాలకు 1.58 టీఎంసిలు, కండలేరు నుంచి 23 మండలాలకు 2.64 టీఎంసిల నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపనున్నామన్నారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడం భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్న మంత్రి జల్ జీవన్ మిషన్ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకుని ప్రతి పల్లెకు నీరందిస్తామన్నారు. మరో మూడేళ్లలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. అమృతధార -2 పేరుతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రూ. 8400 కోట్లతో ప్రజల దాహార్తి శాశ్వతంగా తీర్చడానికి బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆత్మకూరు పట్టణాన్ని అందమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని రాబోయే కాలంలో మరింత ఎక్కువగా ఆత్మకూరులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడ్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కేశవ్, ఆర్‌డబ్ల్యుఎస్, సోమశిల, తెలుగుగంగ, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, నెల్లూరు మున్సిపల్ పబ్లిక్ హెల్త్, పంచాయితీరాజ్ ఎస్ఇలు వెంకటరమణ, వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, దేశ్ నాయక్, గంగాదర్, మోహన్, అశోక్ కుమార్, జడ్పి సిఈవో విద్యారమ, డిసిహెచ్ఎస్ రమేష్ నాథ్, ఆత్మకూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ కె. శేషరత్నం, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి



**కావలిరూరల్, జనవరి31 ప్రభాతవార్త** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, చదువుతున్న కళాశాలకు మంచిపేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని మాజీ శాశనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తెలియచేశారు. కావలి కోఆపరేటివ్ కాలనీలోని శ్రీసాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ గోసల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేసి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపూర్వకంగా చదివి మంచి ఉత్తీర్ణతాశాతాన్ని సాధించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలియచేశారు. అనంతరం అన్నదాత మణి ఆయన ప్రసంగంతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. కళాశాల అధ్యాపకులు కళాశాల కరస్పాండెంట్ గోసల గోపాల్‌రెడ్డిని, వారి సతీమణి లక్ష్మిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. శ్రాంత ఫిజిక్స్ అధ్యాపకులు ఎన్.యానాదిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటు పై అవగాహన కార్యక్రమం




**నెల్లూరు క్రైం, జనవరి 31, ప్రభాతవార్త** సిసి కెమెరాల ఏర్పాటు అవశ్యకతపై నెల్లూరు నగర సబ్ డివిజన్ పరిధిలోని బంగారు, వస్త్ర దుకాణాల యాజమానులతో నగర డిఎస్పి సింధు ప్రియ నేతృత్వంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి మాట్లాడుతూ వ్యాపారులందరూ తమతమ దుకాణాల పరిధిలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు తమ దుకాణాలు ఉన్న వీధుల్లోని ప్రధాన కూడళ్లలో కూడా సిసి కెమెరాలు ఏర్పాటుకు ఎపోలీసు వారికి సహకరించాలని కోరారు. సిసి కెమెరాలు ఏర్పాటుతో నగరంలో నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న బజార్, సంతపేట ఇన్స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వర రావు, దశరధ రామారావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిదులు సింగ్, శోభన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీల ఖాతాల్లోకి రూ.5వేలు

**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త–వైద్యం** కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గర్భిణీలకు మాతృవందన యోజన పథకం ద్వారా వారి వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.5వేలు జమ చేస్తున్నటున్నట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం నగరంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ప్రవీణ్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం గర్భిణీలకు ఒక వరం అని కొనియాడారు. గర్భిణీల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధాన్ మంత్రి మాతృ వందన యోజన పథకం ఎంతో ప్రయోజ కరంగా ఉందని, కానీ ఈ పథకం పట్ల చాలా మంది మహిళలకు అవగాహన లేదన్నారు. గర్భిణీలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, తల్లి, శిశువుల ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. అర్హులైన ప్రతి గర్భిణీ ఈ పథకానికి దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు. మొదటి బిడ్డకు ఈ పథకం వర్తిస్తుందని ఒక వేళ రెండో బిడ్డ ఆడ పిల్ల అయితే మాత్రమే లబ్ది పొందవచ్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర మాతృ సంక్షేమ పథకాలు పొందుతున్న వారు ఈ పథకానికి అర్హులు కారన్నారు. దరఖాస్తు విధానం గర్భిణీలు అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రవీణ్ సూచించారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్స్ వద్ద అప్లికేషన్ ఫారం తీసుకుని, అవసరమైన ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా, గర్భధారణ నమోదు ధృవీకరణ వంటి డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. అలాగే పీఎం ఎంవీవై అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://పీఎంఎంవీవై.డబ్ల్యూసీడీ.జిఓవీ.ఇన్ లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణ మెరుగుపడుతుందన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వంమహిళా సంక్షేమానికి పద్దపీట వేస్తుందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. అర్హులైన గర్భిణీ స్త్రీలు తప్పకుండా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## స్థానిక ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



**మనుబోలు జనవరి 31 ప్రభాతవార్త:** మనుబోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ.గత ప్రభుత్వంలో చేపట్టినటువంటి నాడు నేడు పనులు కింద ఎంత ఖర్చు చేశారు అన్న విషయంపై ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో నాడు నేడు పనుల కింద రూ.66. 50 లక్షల పనులు చేయడం జరిగిందని ఫర్నిచర్‌కు రూ 7 లక్షలు, పెయింటింగ్‌కు రూ 6 లక్షలు మిగిలిన మొత్తంతో 9గదులలోమరమ్మత్తులు, మంచినీటివసతి, టాయిలెట్లవసతి చేపట్టినట్లువిద్యారమకు వివరించారు. మరమ్మతులు చేపట్టిన తొమ్మిది గదులలో ఇంకా రెండు గదులలో మరమ్మత్తులు పూర్తి కాలేదని అడిగి తెలుసుకున్నారు. పై వివరాలతో ఒక నివేదికన తయారు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎస్ఎస్సి అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో ఏవో ముజిముస్నీసా, స్థానిక ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో చదువే కీలకం




**కోవూరు, జనవరి 31, ప్రభాతవార్త :** సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే చదువే ప్రధాన ఆయుధమని, ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి అభివృద్ధిలోకి రావాలని సమాజాభివృద్ధిలో చదువే కీలకమని మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎన్. విజయభారతి పేర్కొన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ప్రత్యేకంగా పలు విషయాలపై చర్చించారు. పాఠశాలలో విద్యార్థినులకు కావాల్సిన ప్రధానమైన మౌలిక వసతులు ఉన్నాయా.. ఉపాధ్యాయుల బోధన ఎలా ఉంది.. మిమ్మల్ని ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా.. పాఠశాలలకు సక్రమంగా వస్తున్నారా.. ఉపాధ్యాయులు చెప్పే విషయాలు మీకు అర్థం అవుతున్నాయా.. మధ్యాహ్న భోజన పథకం ఎలా ఉంది.. తాగునీరు ఉందా అనే విషయాలను విద్యార్థుల ద్వారా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె ఈ పాఠశాల పీఎంశ్రీ పథకంలో ఉందని, ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు పూర్తిగా నిర్దేశించిన వాటికి వ్యయం చేసేలా చూడాలన్నారు. అనంతరం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లోనూ, పాల్ ల్యాబ్‌లోనూ విద్యార్థులతో ఆమె ప్రత్యేకంగా చర్చించారు. క్రీడా ప్రాంగణం ఉందని, దానికి తగ్గట్టుగా క్రీడలు ఆడుతున్నారా అనే విషయాలను కూడా ఈ సందర్భంగా కమిషన్ సభ్యురాలు ఆరా తీశారు. దాదాపు రెండు గంటల పైగా ఈ పరిశీలన సుదీర్ఘంగా కొనసాగింది. పాఠశాల ఆఫీస్‌లో కూడా సరైన వాతావరణం లేదని, పారిశుధ్యం పరిస్థితి కూడా సక్రమంగా లేదని పరిశీలనలో గుర్తించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణికి పలు సూచనలు ఇచ్చారు. మరలా తాను ఆకస్మికంగా వస్తానని, ఈ లోగా పాఠశాల అనుకున్న విధంగా మారాలన్నారు. 700 మంది పైగా విద్యార్థినులు ఉంటే వారికి తగ్గట్టుగా మరుగుదొడ్లు లేవని, ఈ సందర్భంగా పరిశీలనలో గుర్తించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి విద్యార్థికి అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## చదువుతో పాటు క్రీడల పట్ల ప్రాధాన్యత చూపాలి




**కోవూరు, జనవరి 31ప్రభాతవార్త :** విద్యార్థులు ప్రాథమిక ధశ నుంచి కేవలం చదువే కాకుండా ఆట, పాటల పట్ల కూడా దృష్టి సారించాలని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సూచించారు. కోవూరులోని కోనమ్మతోటలో ఉన్న న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్య మ పాఠశాలలో శుక్రవారం 2025 స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లా డుతూ ప్రతి విద్యార్థి క్రీడల పట్ల దృష్టిసారిస్తే మెదడు మరింత పదును పదేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా మానసిక ఒత్తిడి కూడా తగ్గించు కోవచ్చున్నారు. పాఠశాలలో ఏర్పడిన పోటీతత్వం కారణంగా ఎంతసేపటికీ చదువు మీదే దృష్టి సారించడం వలన మానసికంగా , శారీరకంగా విద్యార్థులు అలసిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆటల పట్ల ప్రతి విద్యార్థి దృష్టి పెట్టాలన్నారు. ఇటువంటి క్రీడలను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందిస్తున్నామన్నారు. శారీరక శ్రమ ఉంటేనే మనిషి దృఢంగా ఉంటారన్నారు. చీకటి, వెలుగు ఉంటేనే జీవితమని, సుఖం విలువ తెలియాలంటే కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల్లో మానసిక, శారీరక శ్రమ లేని కారణంగా వారిలో అనేక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి క్రీడల పట్ల దృష్టి సారించి గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ వై. నందకిషోర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా తమ పాఠశాలలో విద్యార్థుల కొరకు ఇటువంటి క్రీడలను నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గాదిరాజు అశోక్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు సూరిశెట్టి శ్రీనివాసులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేప ట్టిన క్రీడా మార్చ్ ప్రతి ఒక్కరినీ అలరింపజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనిత్, ప్రదానో పాధ్యాయుడు కోటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## సీపీఎం బైక్ ర్యాలీ



**కోవూరు, జనవరి 31ప్రభాతవార్త :** నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో ఫిబ్రవరి 1,2,3వ తేదీల్లో జరుగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కోవూరు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని మహిళా నాయకురాలు, న్యాయవాది జక్కా శేషమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం సీనియర్ నాయకులు మాట్లాడుతూ ఈ మహాసభలు మూడు రోజుల పాటు జరగనున్నాయని, వీటికి జాతీయ నాయకులైన ప్రకాష్ బృందాకారత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక ప్రజా సమస్యలపై ఈ మూడు రోజుల పాటు చర్చ కూడా జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 3వ తేది సాయంత్రం ఆత్మకూరు బస్టాండ్ నుంచి వీఆర్‌సీ సెంటర్ వరకు జరిగే కార్యక్రమాలకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు శేషయ్య, బుజ్జయ్య, సుబ్బారావు, రమణయ్య, వెంకటేశ్వర్లు, భాస్కర్, రమేష్, విజయ్‌కుమార్, హరి, సర్దార్, ఎస్‌కే బాబు, తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



**కోవూరు, జనవరి 31ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్దులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీవో జ్యోతి అన్నారు. కోవూరులోని నందలగుంటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్ర వారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భ ంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. రికార్డుల నిర్వహ ణ పారదర్శకంగా ఉండేలా దృష్టి పెట్టాలన్నారు. ము ఖ్యంగా ప్రతి నెల 10వ తేదిలోగా ప్రతి విద్యార్థికి సంబంధించిన ఎత్తు బరువును తూచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకితభావం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చరనయలు తప్పవన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

## బీసీలకు అట్రాసిటి యాక్టును ఏర్పాటు చేయాలి



**ఉలవపాడు, జనవరి 31, ప్రభాతవార్త :** ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి లాంటి చట్టం ఎస్సీ,ఎస్టీలకు ఏ విధంగా ఏర్పాటు చేసిన విధంగా బీసీలకు అట్రాసిటి యాక్టును ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. యాభై శాతంగా ఉన్నటువంటి బీసీలు కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తూ ఓసీల ద్వారా ఎన్నో అవమానాలు పడుతున్నారని ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఓసీలు ప్రవర్తిస్తున్నందున వెంటనే బీసీలకు అట్రాసిటి చట్టాన్ని తీసుకురావాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నేడు గ్రామాల్లో బీసీలపై హత్యలు దాడులు మానభంగాలు అధికమై పోయాయయని వీటన్నిటికి ఏకైక పరిష్కారం బీసీలకు అట్రాసిటి చట్టాన్ని ఏర్పాటు చేయటమేనని శ్రీనివాసులు తెలిపారు. రానున్న రోజులలో అట్రాసిటి చట్టం కొరకు దేశ వ్యాప్తంగా బీసీలు ఉద్యమబాట పట్టవలసి వస్తుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు హరహర పదువులు ఇచ్చినంతమాత్రాన బీసీ కులాల వారికి ఒరిగిందేమి లేదని శ్రీనివాసులు అన్నారు. ఎప్పుడైతే అట్రాసిటి చట్టం వస్తుందో అప్పుడే బీసీలు ఆత్మగౌరవంగా జీవించగలరని దాని కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్దితో అట్రాసిటి చట్టం తీసుకురావాలని ప్రభుత్వాలను శ్రీనివాసులు కోరారు.

## కోవూరు పశు సంవర్ధక శాఖ డివిజన్‌లో శిబిరాలు విజయవంతం



**కోవూరు, జనవరి 31ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలో జనవరి 20వ తేది నుంచి 30వ తేది వరకు నిర్వహించిన పశు వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యాయని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొత్తం సబ్ డివిజన్‌లో 34 పశు వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగిందని పశు వైద్యులు డాక్టర్ ప్రీతి సాల్మన్, డాక్టర్ షబానా, డాక్టర్ రాజేశ్వరిల సహకారంతో పశు సంవర్ధక శాఖ సహాయకులు ఈ శిబిరాల్లో పాల్గొని పాడి రైతులకు పలు సూచనలు అందజేశారన్నారు. మొత్తం 86 గర్భకోశ వ్యాధులకు సంబంధించి పశువులకు పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 29 గేదెలకు కృత్రిమ గర్భోత్పత్తి, 102 పశువులకు సూడి పరీక్షలు, 1074 పశువులకు నులిపురుగు మందులు అందజేయడం, 7009 దూడల్లో నులిపురుగుల ద్రావణం అందించడం, 1472 గొర్రెలు, మేకల్లో బొబ్బర్లు వ్యాధి టీకాలు వేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 1166 కోళ్లకు, కుక్కర్ వ్యాధి నివారణకు గానూ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ శిబిరాలను రెండు మండలాల్లో పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నారన్నారు.

## శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు



**కలువాయి జనవరి 31 ప్రభాతవార్త :** ఆర్యవైశ్యుల కుల దేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం వేడుకలను శుక్రవారం కలువాయిలోని శ్రీ సీతారామ మందిరం నందు కలువాయి వాసవీక్లబ్ మండల శాఖ ఆద్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కన్యకాపరమేశ్వరీ మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతృమూర్తులను అమ్మ వారి స్వరూపంగా భావించి వారికి సారెలు అందజేశారు. శ్రీవాసవీ మాత కారణ జన్మురాలు,శక్తి స్వరూపిణిగా,కామిత వరదాతగా అవతరించి ఆత్మాభిమానానికి ,త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనం అయ్యారని వాసవి క్లబ్ మండల ప్రెసిడెంట్ సోమిశెట్టి మహేష్‌కుమార్ తెలిపారు. రాజరికపు అరాచకత్వాన్ని అహింసాయుతంగా ధిక్కిరించిన ధీరవనత వాసవి మాత అని విశ్వసించిన వారికి మోక్షాన్ని ఇచ్చిన అపర పార్వతీ ఆర్యవైశ్య కులవర్దిని,యశోద వర్దిని, మాఘశుద్ద విదియ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. అదే విధంగా 102 గోత్రాలతో వైశ్య ప్రముఖులు కూడా ఆనాడు ఆత్మబలిదానానికి వాసవి మాతతో పాటు సిద్దపడ్డారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో కలువాయి వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ మహేష్‌కుమార్, ట్రెజరర్ కొమ్మూరు హాజరత్‌బాబు,పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## రథసప్తమి ( సూర్యజయంతి)పై ఆద్యాత్మి ప్రసంగం



**బుచ్చి జనవరి 31 ప్రభాతవార్త :** రథసప్తమి ( సూర్య జయంతి) సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలోని సత్యాన్వేషణ ధ్యాన యోగ ఆధ్యాత్మిక క్షేత్రంలో రెండో రోజు రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహి స్తున్నారు. నెల్లూరు మూలపేటకు చెందిన రాజయోగధ్యాన మందిరం,గీతా ప్రచారక్ నజీర్‌బాషా చే పలు అధ్యాత్మి విషయాలను భక్తులకు వివరించారు.రథసప్తమి విశిష్టత గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో సత్యాన్వేషణ ధ్యాన యోగ ఆధ్యాత్మిక క్షేత్రం గురువు గుబ్బా లక్ష్మీనారాయణ నేతృత్వంలో నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బాలకృష్ణకి పద్మభూషణ్ బిరుదు రావడం ప్రతి తెలుగువారికి గర్వకారణం



**కందుకూరు, జనవరి 31, ప్రభాతవార్త :** తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని, తెలుగువారు గర్వించదగ్గ నటుడు గా పేరు తెచ్చుకున్న గొప్ప వ్యక్తి నటరత్న పద్మభూ షణ్ నందమూరి బాలకృష్ణ అని శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొ న్నారు. బాలకృష్ణకి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదు ప్రకటించిన సందర్భంగా కందుకూరు పట్టణంలోని వెంకట నారాయణ బజార్ అన్న క్యాంటీన్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, నందమూరి అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హైజరై కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన గొప్ప నటుడు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ఇవ్వడం ప్రతి తెలుగు వ్యక్తికి గర్వకారణం. బాలకృష్ణ కేవలం నటుడిగానే కాకుండా తన తండ్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు గెలుపొందిన హిందూపురం నుంచి మూడుసార్లు శాసనసభ్యులు ఎన్నికైన బాలకృష్ణ రాజకీయాల్లో కూడా తన తండ్రికి తగ్గ తనయుడిగా వెలుగుందుతున్నారని కొనియాడారు. సేవే పరమాధిగా క్యాన్సర్ వచ్చే రోగులకు అత్యంత ఆధునిక వైద్యం అందించడానికి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎన్నో సేవలు అందించడం జరుగుతోందని అన్నారు. వైవిద్యమైన నటన ద్వారా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారానికి అన్ని విధాలుగా అర్హుడని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. నటరత్న నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ బిరుదు వచ్చిన సందర్భంగా రెండు రోజుల పాటు అన్న క్యాంటీన్లో భోజన సదుపాయాలు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ కమిటీ కన్వీనర్ పిడికిటి వెంకటేశ్వర్లు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని నందమూరి అభిమారులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధు, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, షేక్ సలాం, చేకూరి వీరాస్వామి, కాకుమాని మాల్యాద్రి, మదిర మధు, షేక్ నజీర్, పలువురు పార్టీ నాయకులు, నందమూరి అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆంధ్రకేసరి మున్సిపల్ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి
## విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన ప్రదర్శన, ధర్నా



**కావలి, జనవరి31 ప్రభాతవార్త :** కావలి పట్టణ జనతాపేటలోఉన్న ఆంధ్రకేసరి ప్రాథమిక ఉన్నతపాఠశాలను 'డి' గ్రేడ్ ఆలోచనను మానుకుని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. పాఠశాలవద్ద ఆందోళన చేశారు. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. జనతాపేటనుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదర్శనగా కావలి ఆర్డీఓ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్స్‌కమిటీ ఛైర్మన్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రకేసరి స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్‌చేసి పాఠశాల అభివృద్ధికి అధికారులు పాటుపడాలని డిమాండ్ చేశారు. మరికొంతమంది తల్లిదండ్రులు మాట్లాడుతూ 71 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆంధ్రకేసరి పాఠశాలను 'డి' గ్రేడ్ చేయడం సరికాదన్నారు. తక్షణమే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైమరి, హైస్కూల్ మాత్రమే ఉండాలని, ప్రభుత్వం ఇచ్చిన జి.ఓను ఈ పాఠశాలకు మినహాయించాలన్నారు. మొత్తం స్కూల్ విద్యార్థులు 500లు పైగా ఉన్నారన్నారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులు 180 మందికి పైగా ఉన్నారన్నారు. హైస్కూల్ అప్‌గ్రేడ్ చేస్తే మరింతమంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. 5వ తరగతి తర్వాత 60 మంది విద్యార్థులు ఉంటే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయవచ్చునన్నారు. అలాగే, ఈ పాఠశాలకు అతిదగ్గరలో మున్సిపాలిటి స్థలం 2 ఎకరాలకు పైగా ఉందన్నారు. అందులో ఆంధ్రకేసరి హైస్కూల్ నిర్మాణం చేయవచ్చునని తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకోవడానికి అనుకూలంగా ఉండే ఈ పాఠశాలను 'డి' గ్రేడ్ చేయడం అన్యాయమన్నారు. 6, 7, 8 తరగతులను తొలగించడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. దగ్గరలో ప్రభుత్వ పాఠశాలలు లేవన్నారు. అధికభారంతో ప్రైవేటుస్కూళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో డ్రాప్‌అవుట్స్ పెరిగే ప్రమాదంకూడా ఉందన్నారు. ఇది భవిష్యత్తులో ఆంధ్రకేసరి మున్సిపల్ పాఠశాల మనుగడకు కూడా సమస్య అవుతుందన్నారు. తక్షణమే 'డి' గ్రేడ్ ఆలోచనను మానుకుని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సూపరిండెంట్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పిడియస్‌యు రాష్ట్రనేత కరవది భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## అందుల పాఠశాలలో అన్నదానం



**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త-వైద్యం :** దివంగత నేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మంగమూరి శ్రీధర్ కృష్ణారెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా నగరంలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో, మంగమూరు కృష్ణచైతన్య శ్రీహరిరెడ్డి, యశ్వంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని విశ్వభారతి అంధుల పాఠశాలలోని విద్యార్థులకు స్టాఫ్‌కు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంగమూరు యశ్వంత్‌రెడ్డి, ఆర్‌కేటి రాజా, కొట్టే వెంకటేశ్వర్లు, ఉదయ్, షాంశీర్, అనిల్, ప్రసాద్, మీరా, భరత్, తేజ, మంగమూరి యువసేన కార్యకర్తలు తదితరులు పై కార్యక్రమంలో పాల్గొని స్వర్గీయ మంగమూరి శ్రీధర్ కృష్ణారెడ్డి నెల్లూరు నగర అభివృద్ధికి ప్రజా శ్రేయస్సుకు వారు చేసిన సేవలను గుర్తు చేసుకుని వారికి శ్రద్దాంజలి ఘటించారు.

## రాష్ట్ర అభివృద్ధి నారాయణ ధ్యేయం



**నెల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త-వైద్యం :** రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పని చేస్తున్న పొంగూరు నారాయణపై విమర్శలు చేయడం తగదని తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కప్పిర రేవతి హితవు పలికారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నెల్లూరు నగరంలో నారాయణ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఎంతో మంది కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల దాకా ఎక్కడున్నాడో తెలియని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నో ఆరోపణలు ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి నారాయణపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మైనార్టీల పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీది కపట ప్రేమని ఖలీల్ అహ్మద్‌ను నమ్మించి మోసం చేశారన్నారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీ అయ్యేందుకు నారాయణ విద్యాసంస్థల చుట్టూ ఓట్ల కోసం తిరిగాడని విమర్శించారు. బిఫారం వైసీపీలో తీసుకుని గెలిచి తెలుగుదేశం పార్టీలోకి బెదిరించి తీసుకొచ్చారని గోవర్ధన్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అనటం సిగ్గుచేటని వాళ్లు వైసీపీలో ఉండి ఆత్మవంచన చేసుకోలేక ఆ దుర్మార్గపు ప్రభుత్వంలో ఎమడలేక వచ్చేశారని దానికి ముందే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఫొటో రెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కావ్య కృష్ణారెడ్డి ప్రశాంత్‌రెడ్డి, మేకపాటిచంద్రశేఖర్‌రెడ్డి ఆ దుర్మార్గం ప్రభుత్వం వద్దని తెలుగుదేశంలోకి రావడం జరిగింది. కాబట్టి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన వాళ్ళని తెలుగుదేశం పార్టీలో ఉండే నాయకుల్ని విమర్శించే అర్హత లేదని మండిపడ్డారు. పై ప్రెస్ మీట్‌లో బీసీ పార్లమెంట్ అధ్యక్షుడు కపిల్ శ్రీనివాసులు, నగర మహిళా అధ్యక్షురాలు రేవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారి విజయమ్మ, 49వ డివిజన్‌కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## టీచరు సులోచన సేవలు ప్రశంసనీయము- ఎంఈవో



**వలేటివారిపాలెం జనవరి 31, ప్రభాతవార్త :** మండలంలోని పోకూరు డిపెప్ స్కూలులో హెడ్మాష్టర్‌గా పనిచేస్తున్న కామేపల్లి సులోచన సేవలు ప్రశంసనీయమని మండల విద్యాశాఖాధికారులు రవికుమార్, మల్లికార్జునలు అన్నారు.శుకృవారం ఆమె పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలోజరిగిన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిధులుగా పాల్గొని ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు.పలు ఉపాధ్యాయ సంఘనేతలు కల్లగుంట మోహనరావు,సంగా మహేంద్ర,వెంకటరావు, శివన్నారాయణ,వలేటి మాల కొండయ్య,ముతకని హనుమంతరావు,పాల్ జాన్సన్, ప్రసాదరావు,వెంకటరత్నం తదితరులు హాజరై సులోచనను ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు.

## కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు
## మహిళలతో కిక్కిరిసిన ఆలయం



**కావలి, జనవరి31 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం విశేష అభిషేకా ర్చనలు, మహిళలచే సామూహిక కుంకుమార్చనలు ఎంతో వైభవంగా జరిగాయి. కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. మహిళలతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆలయపూజారి సుబ్బుస్వామి మహిళలచేత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనపూజలు చేయిం చారు. ఆలయ కమిటి నిర్వాహకులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. తీర్థప్రసాదాలు అందచేశారు. జై వాసవీ మాత అంటూ భక్తులు అమ్మవారిని స్తుతిస్తూ ఆధ్యాత్మికచింతనలో మునిగిపోయారు. ఆలయ కమిటీ కార్యదర్శి చీదెళ్ల రామచంద్రరావు, నిర్వాహకులు ఓలేటి నాగేశ్వరరావు, అమరావేదగిరి సుబ్బరా యుడు గుప్తా, కనమర్లపూడి వెంకట నారాయణ, ఒరుగంటి సురేష్, వేమారావు, గాదంశెట్టి మధు, బొగ్గవ రపు సత్య, ఎల్చూరి రవి, అమరా నాగేశ్వరరావు, నల్లూరు రోశయ్య, కందుకూరి బాబు, పొత్తూరి సురే ంద్ర, పెద్దులు, ఆర్యవైశ్యనేతలు తిరివీధి ప్రసాద్, ఒరుగంటి రామకృష్ణ, వాసవి వనితాక్లబ్ మహిళలు, పట్ట ణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు. -ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి వస్త్రాలు.కావలి మం డల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యసంఘం సభ్యులు అమ్మవారికి వస్త్రాలు అందచేశారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## అటవిప్రాంతంలో జామాయిల్‌తోట అక్రమ నరికివేత

**జలదంకి, జనవరి31,ప్రభాతవార్త:** జలదంకి మండలం చోడవరం అటవీప్రాంతంలో జామాయిల్‌తోటను గురువారం రాత్రి అదేగ్రామానికి చెందిన కొందరు అక్రమంగ నరికివేశారు.కర్రను ట్రాక్టర్‌లో తరలిస్తున్న వైనం అటవి సబ్బందికి సమాచారం అందడంతో కావలి రేంజ్ అధికారి రామిరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది హోటాహుటిన తరలి దాడులు నిర్వహించారు.ట్రాక్టర్‌ను సీజ్‌చేసి నలుగురుని అదుపులోకి తీసుకున్నారు.వీరయ్య,మహేంద్ర,కొండయ్య,మనోహర్‌లపై కేసునమోదుచేసి జరిమాన విధించారు.అటవి ప్రాంతంలో ఎవరైన అక్రమంగ ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని రేంజర్ రామిరెడ్డి హెచ్చరించారు.

## వైసిపి ఫీజుపోరును విజయవంతం చేయండి



**ఆత్మకూరు, జనవరి31,ప్రభాతవార్త:** వైసిపి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీన విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ కూటమి సర్కార్‌పై నిరసన గళం వినిపించేందుకు నిర్వహిస్తున్న ఫీజుపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని వూసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.ఆదిశేషయ్య , పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆత్మకూరులోని మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఫిబ్రవరి 5న నిర్వహించనున్న వైసిపి ఫీజుపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద పిల్లలకు పెద్ద చదువులు సాకారం చేస్తూ ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తసీఉకువచ్చారని దీంతో నిరుపేదల ఇళ్ళలో నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు ఎంతో మంది వచ్చారన్నారు. 2014-19మధ్యలో వచ్చిన చంద్రబాబు సర్కార్ ఈ పథకానికి తిలోదకాలు వదిలిందని, ఉద్దేశపూర్వకంగా బకాయిలు పెట్టి , కళాశలల యాజమాన్యాలను , విద్యార్థులను ఇబ్బంది పాలు చేసిందన్నారు. 2019లో వచ్చిన వైఎస్‌జగన్ తండ్రికి మించిన తనయుడిగా పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని, 93శాతం మంది పిల్లలకు మేలు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు .ఫిబ్రవరి 5న ఉదయం 10గంటలకు నెల్లూరు నగరంలోని విఆర్‌సి సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీనిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, ఆండ్రా సుబ్బారెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, పాలేటి వెంగళరెడ్డి, కల్పనారెడ్డి, తోడేటి మణి, చైతన్య తదితరులుపాల్గొన్నారు.

## సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**ఆత్మకూరు, జనవరి31,ప్రభాతవార్త:** ఆత్మకూరుపట్టణంలో స్థానిక మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌వద్ద సిపిఎం నాయకులు ప్రచార కార్యక్రమాన్నినిర్వహించారు. నెల్లూరు పట్టణంలో మూడురోజులపాటు జరిగే రాష్ట్ర మహాసభలు 1వ తేదీన ప్రారంభమై 3వ తేదీన భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభతో ఈమహాసభలు ముగుస్తాయని ఆత్మకూరు సిపిఎం నాయకులు నాగయ్య తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ మహాసభల్లో పార్టీకి సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు నాయకులు తీసుకుంటారన్నారు. ఈ మహాసభలకు నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం టౌన్‌కమిటీ సభ్యులు ఎం.నాగేంద్ర, పేమల వెంకటయ్య, సాలారుద్దీన్, మహబూబ్‌బాషా, ఎ.అశోక్, కోదూరు ప్రసాద్, టంగుటూరు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## హంసవేణిని సత్కరించిన ఎంపిడీఓ శ్రీదేవి



**కావలిరూరల్, జనవరి31 ప్రభాతవార్త :** కావలి మండల పరిషత్ కార్యాలయంనందు విధినిర్వహణలో విశిష్ఠసేవలు అందించి గణతంత్రదినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చేతులమీదుగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న జూనియర్ సహాయకులు బి.హంసవేణిని శుక్రవారం కావలి మండలపరిషత్ కార్యాలయంనందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీదేవి దుశ్శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి విస్తరణాధికారి అబ్దుల్‌సమద్, సీనియర్ సహాయకులు సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

